ప్యారానగర్‌లో డంప్‌యార్డు పెట్టొద్దు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ప్రజలకు ఇబ్బందులు కల్గించే డంప్‌యార్డును ప్యారానగర్‌లో పెట్టొద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేయాలనుకుంటున్న డంప్‌యార్డు ఎత్తివేయాలన్న డిమాండ్‌తో నర్సాపూర్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి ఐదవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుక్రవారం రిలే దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ... డంప్‌యార్డుతో నర్సాపూర్ అడవులకు ముంపు ఉందని, రాయరావుకు ప్రధాన నీటి వనరుగా ఉన్న పంది వాగు, చెరువు కలుషితమవుతుందని విచారం వ్యక్తం చేశారు. వాటిపై ఆధారపడిన మత్స్యకారులు, చాకలి కులస్తులు ఉపాధి కోల్పోయో ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ అడవుల్లో ప్రభుత్వం అర్బన్ పార్కు పెట్టి పర్యాటకంగా అభివృద్ధి చేసిందని, పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కాటేజీలు నిర్మిస్తున్న ప్రభుత్వం ప్యారానగర్‌లో డంప్‌యార్డు పెడితే అటవి ప్రాంతం కలుషితమైతే పర్యాటకులు అక్కడికి ఎలా వస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలు డంప్‌యార్డును ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రజల అభీష్టం మేరకు డంప్‌యార్డును అక్కడి నుంచి ఎత్తి వేయాలన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ తదితరులు దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. రిలే దీక్షలో రిటైర్డు ఉద్యోగులు సత్యానారాయణ, గంగరాం, కృష్ణస్వామి, ధన్‌సింగ్‌లతో పాటు మత్స్యకారుల సంఘం ప్రతినిధులు నాగభూషణం, కుమార్, యాదగిరి, సంతోష్, అశోక్, నాగభూషణం, జేఏసీ నాయకులు రాజేందర్, సత్యంగౌడ్, ఆనంద్‌కుమార్, చిన్న అంజిగౌడ్, నాగేందర్‌గౌడ్, షర్ఫొద్దీన్, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

క్లుప్తంగా

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి


తీర్మానం చేస్తున్న రైతులు

రేగోడ్(మెదక్): వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మండలంలోని కొండాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రైతులందరూ కలిసి తీర్మానం చేశారు. కొండాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే జగిర్యాల, ఆర్.ఇటిక్యాల రైతులకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. రేగోడ్‌లోని రైతువేదికలో రైతులతో ఏఓ జావీద్ సమావేశాన్ని నిర్వహించారు. వరి ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన మెళకువలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి కరుణాకర్, ఏఈఓ భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత


పూజల్లో పాల్గొన్న మాధవానంద సరస్వతి

పెద్దశంకరంపేట(మెదక్): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఆత్మలింగ శివాలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య గణపతి, గోపూజ, యాగప్రవేశం, రుత్విక్‌వరణం, నవగ్రహపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు మాధవానంద సరస్వతి స్వామి ప్రవచనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్ బాయి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామస్తులు, పురోహితులు చంద్రశేఖరశర్మ, సంతోష్ శర్మ, శ్రీనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

గజగట్లపల్లి పాఠశాల తనిఖీ


విద్యార్థుల సామర్థ్యం పరిశీలిస్తున్న ఎంఈఓ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పుష్పవేణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కనీస సమర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థం అయ్యేలా ఎల్ఎఫ్ఎల్ విధానంలో బోధన ఏయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గాలయ్యకు పలు సూచనలు చేశారు.

పరిశుభ్రమైన ఆహారం పెట్టండి


మక్కరాజీపేట పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

చేగుంట(తూప్రాన్): విద్యార్థులకు నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన ఆహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి హైమవతి అన్నారు. మండలంలోని మక్కరాజీపేట ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేక అధికారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండుతున్న వంటకాలను హైమవతి పరిశీలించి ఉపాధ్యాయులకు, భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం ఉమారాణి, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టణానికి చెందిన ఆమర శ్రీనివాస్ జ్ఞాపకార్థం ఆయన మిత్రబృందం శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించింది. ఈ చలివేంద్రాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాము, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. శుక్రవారం కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని, చదువుల్లో రాణించాన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లెక్చరర్లు అనంతరాజ్, హరిత, ప్రభాకర్, రమేశ్, రాజు, శ్రీశైలం, మల్లేశం, జహీరాబేగం, కిష్టారెడ్డి, విజయభాస్కర్, శ్రీలత, అశ్విని తదితరులున్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


చిలప్‌చెడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


పెద్దశంకరంపేట(మెదక్): మల్కాపూర్‌లో స్వయంపరిపాలన దినోత్సవం


శివ్వంపేట(నర్సాపూర్): దంతాన్‌పల్లిలో..


చిన్నశంకరంపేట(మెదక్): మిర్జాపల్లిలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా సనిత్, ఎంఈఓగా వరుణ్‌తేజ్, హెచ్ఎంగా సాయిసుప్రజ, ఉపాధ్యాయులుగా చైత్ర, సాయిప్రియ, సాయికిరణ్, రిత్విక్, సాయికీర్తన, చరణ్యశ్రీ, ప్రవళిక, రేవతి, మల్లేశ్, ధనుష్ వ్యవహరించారు.

మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ..

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓగా అంజనేయులు, ఎంఈఓగా శివకుమార్, హెచ్ఎంగా నర్సింహగౌడ్, ఉపాధ్యాయులుగా సుస్మిత, చిరంజీవి, వైష్ణవి, తుకారం, పరశురాం, మురళీకృష్ణ, రాజు, లోకేష్ వ్యవహరించారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డీఈఓగా ప్రణయ్, ఎంపీఓగా గీతిక, హెచ్ఎంగా అజ్మత్‌అలితో పాటు ఉపాధ్యాయులుగా విద్యార్థులు ఒక్కరోజు విధులు నిర్వర్తించారు. పాఠశాల హెచ్ఎం ఓంప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. డీఈఓగా మనిదీప్, ఎంఈఓగా శ్రీకరి, హెచ్ఎంగా శివతేజ, ఉపాధ్యాయులుగా వైష్ణవి, హర్షిక, శ్రీనిధి, అక్షయ, రాజ్‌కుమార్, రఘునందన్, శ్రీరామ్, లోకేష్ వ్యవహరించారు. హెచ్ఎం బాల్‌రాజ్, ఎంఈఓ పుష్పవేణి వారిని అభినందించారు.

దంతాన్‌పల్లిలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దంతాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓగా ప్రదీప్, ఎంపీడీఓగా హన్సిక్, ఎంఆర్ఓగా యశ్వంత్, హెచ్ఎంగా దీక్షిత్, ఉపాధ్యాయులుగా నందిని, కృతిక, తదితరులు విధులు నిర్వర్తించారు.

వరి కోతలపై రైతులకు అవగాహన


శివ్వంపేటలో మాట్లాడుతున్న డీఏఓ వినయ్


అవగాహన కల్పిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు వరికోత సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని డీఏఓ విన్సెంట్ వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని శివ్వంపేట, గోమారం, దొంతి, కొత్తపేట రైతువేదికల్లో రైతులకు వరికోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరికోత యంత్రం నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సంధ్యరాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

తేమ శాతం 17 కంటే మించొద్దు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని రైతు వేదికలో యాసంగి వరి కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి నూర్పిడి జరిగిన అనంతరం తేమ శాతం 17 కంటే మించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు రమ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): పంట కోతల సమయంలోనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ ఏడీఏ విజయ నిర్మల సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట రైతువేదికలో వరి కోతలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్ కుమార్, ఏఈఓ మధులిక పాల్గొన్నారు.

కుసంగిలో..

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు వరి కోతలు కోసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాం ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఎలకుర్తి, కుసంగి, టేక్మాల్, కాదులూర్, ఎల్లుపేట్ గ్రామాల్లో వరి కోతలు, వరి కొనుగోలు కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. ఇందులో మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసూఫ్, ఆయా క్లస్టర్‌ల ఏఈఓలు ఇంద్రయ్య, ప్రవీణ్, మీనా, లక్ష్మి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి(తూప్రాన్): కేజీబీవీ వెల్దుర్తిలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు గెస్ట్ టీచర్ నియామకం కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ ఫాతిమా తెలిపారు. ఫిజిక్స్‌లో పీజీ పూర్తి చేసిన పట్టభద్రులు లేదా బీఈడీ ఫిజిక్స్ బోధనలో కనీసం ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉన్నవారు ఈ నెల 25 తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా అర్హతలు ఉండి ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా లేదా కేజీబీవీ వెల్దుర్తికి పోస్టులో దరఖాస్తులు పంపవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 7702076136 ను సంప్రదించాలని సూచించారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లకు ఓటరు స్లిప్‌ల పంపిణీ చేస్తామని తహసీల్దార్ మన్నన్ తెలిపారు. మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 565 మంది ఉండగా, ఇప్పటి వరకు 383 మందికి ఓటరు స్లిప్‌లు అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఓటర్లు 41 మంది ఉండగా, 20 మందికి ఓటరు స్లిప్‌లు అందించామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు ప్రవేశ పరీక్షలు

తూప్రాన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు కామన్ ప్రవేశ పరీక్షలు ఆదివారం తూప్రాన్ మండలం దాతర్‌పల్లి(చర్చ్ భవనం)లో నిర్వహించనున్నట్లు తూప్రాన్ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో 5వ తరగతి నుంచి 9 వ తరగతికి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షలకు వచ్చేవాళ్లు తమ ఆధార్‌కార్డుతో పాటు ప్యాడ్, పెన్ను, పెన్సిలను తెచ్చుకోవాలన్నారు.

ఈజీఎస్ తనిఖీ బృందానికి సహకరించండి

చిన్నశంకరంపేట(మెదక్): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించిన పనుల తనిఖీకి గ్రామాలకు వస్తున్న సామాజిక తనిఖీ అధికారులకు గ్రామస్తులు సహకరించాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. శుక్రవారం ఎంపీపీ కార్యాలయంలో జీజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు గ్రామాల్లో ఈజీఎస్ పనులు పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్, వెంకటసాయి, ఎస్ఆర్‌పీ రవి, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్‌లో నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పోచయ్య, పోచాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బొలేరో వాహనం బోల్తా

ఒకరు మృతి

నిజాంపేట(మెదక్): బొలేరో వాహనం బోల్తా పడి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన నిజాంపేట మండల శివారులో చోటు చేసుకుంది. కార్మికుల కథనం మేరకు.. జాతీయ రహదారి 765డీజీ పనులు చేస్తున్న 9 మంది కార్మికులతో బొలేరో వాహనం వెళ్తుంది. రోడ్డు వెంబడి సైన్ బోర్డు ఏర్పాటు చేయడానికి సిద్దిపేట నుంచి రామాయంపేటకు వస్తున్న క్రమంలో నిజాంపేట గ్రామ శివారులోని శిరుకవాగు సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన అమ్రేశ్(28) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తిప్పన్నకి తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆరుగురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దు

చిలప్‌చెడ్(నర్సాపూర్): నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ నర్సింలు అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని చిట్కుల్ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, నంబర్‌ప్లేట్‌లు లేకుండా నడుపుతున్న రెండు బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనంతరం బైక్ యజమానులు సంబంధిత పత్రాలు చూపితే, బైక్‌లకు నెంబర్‌ప్లేట్‌లు పెట్టించి, వదిలేశామన్నారు. అదేవిధంగా రోడ్డు నిబంధనలు అతిక్రమించిన, మద్యం సేవించి, వాహనాలు నడిపిన, మైనర్‌లను డ్రైవింగ్ చేసేందుకు ప్రోత్సహించిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.


వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


పెద్దశంకరంపేటలో బీజేపీ నాయకుల ప్రచారం


కౌడిపల్లిలో మాట్లాడుతున్న రాజేందర్

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి రాజేందర్ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా కొమురయ్య, అంజిరెడ్డిలకు మొదటి ప్రధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరుతూ ఓటర్లను నేరుగా కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్రంలోని బీజేపీ గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాకేశ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దశంకరంపేట(మెదక్): నిరుద్యోగుల, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి చేస్తుందని ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని శుక్రవారం మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు శ్రావణ్, కృష్ణ, రాజాగౌడ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


నార్సింగిలో ..

నార్సింగి మండల కేంద్రంలో..

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలో ఓటర్లను కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లింగారెడ్డి, పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, లక్ష్మణ్, సందీప్, గురుపాథం, సత్యం, రమేశ్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని, ఇళ్లు కట్టుకోకుంటే ప్రభుత్వం రద్దు చేస్తుందని ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ విద్యసాగర్‌లు చెప్పారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ.. శుక్రవారం మండల పరిధిలోని నడిమితండాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణంపై అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలన్నారు. బెస్మెంట్ వరకు నిర్మిస్తే రూ. లక్ష లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం వేస్తుందన్నారు. ఇళ్లు కట్టుకోకుంటే ప్రభుత్వం రద్దు చేస్తుందని వారు తెలిపారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని శభాష్‌పల్లి శివారులోని సుగుణ ఫుడ్స్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ విజయం సాధించింది. యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూ తరుపున మల్లికార్జున్ ఎన్నిక కావడంతో పరిశ్రమ ఎదుట కార్మికులు భారీ ఎత్తున పటాకులు కాల్చుతూ సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో సుగుణ ఫుడ్స్ కంపెనీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి కుమార్, ఇంద్రేష్, శేఖర్, కల్లూరి రాజు, సాయిలు, షబ్బీర్, భిక్షపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


సంబరాలు చేసుకుంటున్న కార్మికులు

ప్రకటన

నా క్లయింట్ అయిన దీప్తి విద్యాలయం హై స్కూల్, చేగుంట, మెదక్ నిర్వహణ కమిటీ సూచనల మేరకు తెలియజేయునది. కొంతమంది మాజీ సిబ్బంది స్కూల్ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నంలో భాగంగా, వదంతులను వ్యాప్తి చేసేలా స్వర క్లిప్స్ మరియు చిత్రాలను ప్రచారం చేస్తున్నారు, అని దృష్టికి వచ్చినది.

ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము మరియు ప్రజలను అటువంటి అసత్య సమాచారాన్ని నమ్మకుండా, వ్యాప్తి చేయకుండా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఇది ఎవరు చేసినా, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

ఇట్లు
సం/- సునీల్ కుమార్ సెగ్గారి
అడ్వకేట్
పోత్రాజుపల్లి, తూప్రాన్, మెదక్.
మొబైల్ నం.: 9849052154

లక్ష్యం మేరకు మొక్కలు పెంచండి

ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లోని వన నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొట్టాల, వెల్మకన్న గ్రామాల్లో వన నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలోని నర్సరీల్లో 5 వేల మొక్కలు పెంచాలన్నారు. పండ్లు, పూలు, నీడనిచ్చే తదితర అన్ని రకాల మొక్కలు ఉండాలన్నారు. వచ్చే వర్షకాలం వనమహోత్సం నాటికి మొక్కలు ఏపుగా పెరిగేలా సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు. గ్రామాలు, తండాల్లో నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు మల్లేశం, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.


కొట్టాలలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

ఘనంగా మాతృభాష వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సాపూర్: మాతృభాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం తమ పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించామని శ్రీవిష్ణు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జామి తెలిపారు. విద్యార్థులకు వ్యాస రచన, పాటల పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు ఉమాకాంత్, రాందాస్, తులసి, శేఖర్, జెస్సీ, ప్రమిథ, నర్సింహులు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.